సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 10 । మార్చి । 2023



పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్, 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. 8లో



సేవల పెంపునకు కృషి

సచివాలయాల్లో ఏపీ సేవా సర్వీసులు పెంచేందుకు కృషి చేయాలని డీఎల్‌డీవో పూర్ణిమాదేవి ఆదేశించారు. 8లో



సీతంరాజుకు లాయర్ల మద్దతు

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు జూనియర్ లాయర్లు మద్దతు ప్రకటించారు. 8లో

న్యూస్‌రీల్

జాతీయ విపత్తుల వేదికకు నగర మేయర్



డాబాగార్డెన్స్: జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ విపత్తుల మూడో సెషన్‌లో పాల్గొనున్నారు. నేషనల్ ఫోరం డిజాస్టర్ రిస్క్ అండ్ రెడ్యూస్ అర్బన్ లోకల్ బాడీస్ తరపున హరివెంకటకుమారిని సభ్యురాలిగా రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు శుక్రవారం ఢిల్లీ బయలుదేరనున్నట్టు ఈ సందర్భంగా మేయర్ చెప్పారు.

డీసీఐకి సదరన్ నేవల్ కమాండ్ నిర్వహణ కాంట్రాక్టు



డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం : వరుస కాంట్రాక్టులతో దూసుకుపోతున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐ) మరో భారీ పనులను దక్కించుకుంది. కొచ్చికి చెందిన సదరన్ నేవల్ కమాండ్(ఎస్ఎన్‌సీ) నిర్వహణ బాధ్యతల కాంట్రాక్టును డీసీఐ సొంతం చేసుకున్నట్లు డీసీఐ ఎండీ కెప్టెన్ దివాకర్ వెల్లడించారు. ప్రతిష్ఠాత్మకమైన ఎస్ఎన్‌సీ నేవల్ చానల్ నిర్వహణ పనులను రూ.64 కోట్లతో ఎర్నాకులంలోని డీసీఐ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ చానల్‌లో మొత్తం ఏడాది కాలంలో 1.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల వరకూ డ్రెడ్జ్ చేయనున్నట్లు ఎండీ తెలిపారు.

11, 12 తేదీల్లో వేద విద్యా సమ్మేళనం



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర వేద విద్యా ట్రస్ట్ కార్యదర్శి కంభంపాటి భాస్కరరావు

సీతంపేట: శంకరమఠంలో ఈ నెల 11, 12 తేదీల్లో 23వ వేద విద్యా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఉత్తరాంధ్ర వేద విద్యా ట్రస్ట్ కార్యదర్శి కంభంపాటి భాస్కరరావు తెలిపారు. శంకరమఠంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కంచికామ కోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆశీస్సులతో జరుగుతున్న ఈ వేద విద్యా సమ్మేళనంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 100 మంది వేద పండితులు, 120 మంది వేద విద్యార్థులు పాల్గొంటున్నట్లు చెప్పారు. అన్ని వేదాలు, వివిధ విభాగాల్లో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని వెల్లడించారు. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు ముఖ్య అతిథిగా, శంకరమఠం ముఖ్య సలహాదారులు, సీనియర్ న్యాయవాది కె.వి.రామ్మూర్తి, స్ప్రింట్ ఎక్స్‌పోర్ట్స్ ఎండీ గుంటూరు పవన్‌కుమార్ అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.


24 నుంచి డిగ్రీ పరీక్షలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

- డిగ్రీ మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. అదే విధంగా రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా వచ్చేనెల 6 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. సబ్జెక్టుల వారీగా పరీక్షల తేదీలు, ఇతర వివరాలు ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం

విశాఖ విద్య: పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో ఎస్‌సీఈఆర్టీ ముద్రించిన ప్రశ్నా పత్రాన్ని విద్యార్థులకు అందజేశారు. వచ్చే నెలలో పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులను సన్నద్ధం చేసేలా ప్రీ ఫైనల్ పరీక్షలపై విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు 1 నుంచి 9వ తరగతి వరకు ఫార్మేటివ్ పరీక్షలు సైతం ప్రారంభమయ్యాయి.



కాంతులీనుతున్న బీచ్‌రోడ్డు



బీచ్‌రోడ్డులో విగ్రహాలకు కొత్త రంగులు

సుందర నగరి సొగసులు

జీ 20 సదస్సుకు ముస్తాబవుతున్న నగరం

సాక్షి, విశాఖపట్నం : మహా విశాఖ నగరం మరో ప్రతిష్ఠాత్మక సదస్సుకు సన్నద్ధమవుతోంది. రుషికొండ సమీపంలోని రాడిసన్ బ్లూ హోటల్ జీ-20 సదస్సుకు ముస్తాబైంది. ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు సదస్సు నిర్వహించనున్నారు. 27వ తేదీ నుంచే జీ 20 దేశాలకు చెందిన ప్రతినిధులు విశాఖ నగరానికి చేరుకోనున్నారు. ఒక్కో దేశం నుంచి ఒకరు లేదా ఇద్దరు, ముగ్గురు చొప్పున మొత్తం 150 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారని అధికారులు భావిస్తున్నారు. దీనికి తగ్గట్లుగానే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రాడిసన్ బ్లూ హోటల్‌లో ఉన్న 99 గదుల్ని ఈ సదస్సు కోసం వచ్చే ప్రతినిధులకోసం బ్లాక్ చేశారు. అదేవిధంగా పార్క్ హోటల్‌లో 30, ఇతర స్టార్ హోటల్స్‌లో మరో 20 గదుల్ని రిజర్వ్ చేశారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ అనే థీమ్‌పై సదస్సు జరగనుంది. 28వ తేదీ సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే అవకాశాలున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సాంస్కృతిక, వారసత్వ సంపదకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఏవీ ప్రదర్శించనున్నారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు కూడా హాజరవ్వనున్నారు. సదస్సులో భాగంగా జీ 20 ప్రతినిధులకు సిటీ టూర్ కూడా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలతో పాటు కాపులుప్పాడలో ఏర్పాటు చేసిన వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, మేఘాద్రిగెడ్డ, ముడసర్లోవ రిజర్వాయర్లలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను సందర్శించనున్నారు. జీ20 సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ మల్లికార్జున ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు.



సాగర్‌నగర్ బీచ్‌లో ఏర్పాటు చేసిన కొబ్బరి చెట్లు



తెన్నేటిపార్కు జంక్షన్‌లో విద్యుత్ అలంకరణ

● అందాల భామ హనీరోజ్ సందడి



విశాఖలో హీరోయిన్ హనీరోజ్ సందడి చేసింది. గురువారం నగరంలో ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమెను చూసేందుకు యూత్, ఫ్యాన్స్ భారీ ఎత్తున తరలివచ్చారు. నీలి రంగు చీరలో ఉన్న ఆమె అందానికి కుర్రాళ్లు ఫిదా అయ్యారు. తొలిసారిగా విశాఖ వచ్చానన్న ఆమె.. ఇది అందమైన ప్రశాంత నగరమని పొగడ్తలతో ముంచెత్తారు.

జోరుగా పోలింగ్ ఏర్పాట్లు

- పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఆర్వో మల్లికార్జున
- ఇప్పటికే బ్యాలెట్ పేపర్ల పంపిణీ పూర్తి
- 1000 ఓట్లు దాటితే మూడో బ్యాలెట్ బాక్స్

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పోలింగ్ సామగ్రి పంపిణీ, తదితర అంశాలపై నిరంతరం సమీక్షిస్తున్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో బ్యాలెట్ పేపర్స్ పంపిణీ ప్రక్రియ గురువారం ఉదయానికి సజావుగా పూర్తయింది. పోలింగ్ స్టేషన్లకు అవసరమైన సామగ్రిని తరలించే ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. ఈ నెల 13న పోలింగ్ జరగనుండడంతో 11న సాయంత్రం 4 గంటలకు ప్రచారాన్ని ముగించాలని ఇప్పటికే బరిలో నిలిచిన అభ్యర్థులందరికీ ఆదేశాలు జారీచేశారు. మరోవైపు ఎన్నికల విధులకు వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందిని వినియోగించుకోవచ్చని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల విధులను ఆయా ఉద్యోగులు, అధికారులకు అప్పగించేశామనీ.. అవసరమైతే సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవచ్చని బీఎల్‌వోలకు సూచించారు. మరోవైపు 56 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1000కి పైగా ఓట్లున్నాయి. ఈ నేపథ్యంలో నిబంధనల మేరకు ఒక బ్యాలెట్ బాక్సులో గరిష్ఠంగా 500 ఓట్లు మాత్రమే ఉంచాలి. 500 ఓట్లు దాటిన ప్రతి పోలింగ్ స్టేషన్‌కు 2 చొప్పున బ్యాలెట్ బాక్సులు అందిస్తున్నారు. 1,000 మందికి పైగా ఓటర్లున్న పోలింగ్ బూత్‌లలో మూడు బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేయనున్నారు. ఒక బ్యాలెట్ బాక్స్ నిండిన వెంటనే పోలింగ్ ఏజెంట్లు, అధికారులు, భద్రతా సిబ్బంది పర్యవేక్షణలో దానికి సీల్ వేయనున్నారు. ఇప్పటివరకు జిల్లా పరిధిలో మొత్తం 193 పోస్టల్ బ్యాలెట్స్‌కు దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో ఆయా ఉద్యోగులకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

358 బ్యాలెట్ బాక్సులు సిద్ధం

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. ఎన్నికల నిర్వహణపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ జిల్లా పరిధిలో మొత్తం 112 పోలింగ్ కేంద్రాలకు 358 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని తెలిపారు. 84 శాతం వరకూ ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. జిల్లాకు అవసరమైన బ్యాలెట్ పేపర్లతోపాటు అదనంగా 5 శాతం అందుబాటులో ఉంచినట్లు వివరించారు. సమావేశంలో జేసీ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

దొండపర్తి: ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే విధంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 13న ఎమ్మెల్సీ పోలింగ్ జరగనున్న దృష్ట్యా భద్రత చర్యలపై గురువారం పోలీస్ సమావేశ మందిరంలో సీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో చేస్తున్న బందోబస్తు ఏర్పాట్లపై ఎస్‌హెచ్‌వోలను సీపీ అడిగి తెలుసుకున్నారు. డీసీపీలు తమ జోన్ల పరిధిలో పోలింగ్ కేంద్రాల వద్ద చేపడుతున్న భద్రత ఏర్పాట్లపై కూడా ఆరా తీశారు. పోలింగ్ సమయంలో ఎన్నికల సామగ్రి తీసుకువెళ్లే వాహనాలకు ఉండాల్సిన ఎస్కార్ట్‌లు, మొత్తం రూట్లు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ల సంఖ్యపై చర్చించారు. అదనంగా ఉండాల్సిన రిజర్వ్ ఫోర్స్, వాటిని ఏయే జోన్లకు కేటాయించాలన్న అంశాలపై సీపీ అధికారులకు పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టుల పనితీరు తెలుసుకున్నారు. ఎన్నికల జరిగే ముందు రోజు నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ పోలింగ్ బూత్‌లు సందర్శించిన సీపీ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 13వ తేదీన జరగనున్న దృష్ట్యా ఏయూలో ఉన్న పోలింగ్ బూత్‌లను నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఏడీసీపీ(ఎస్‌బీ) డి.గంగాధర్, ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేస్తున్న బందోబస్తు చర్యలను పరిశీలించారు.

నేడు ఆన్‌లైన్‌లో వన్డే టిక్కెట్ల విక్రయం

14న ఆఫ్‌లైన్‌లో మూడు ప్రాంతాల్లో..



విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో భారత్–ఆస్ట్రేలియాల మధ్య ఈనెల 19న జరగనున్న డేనైట్ వన్డే మ్యాచ్ టికెట్లను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఆన్‌లైన్‌లో విక్రయించనున్నారు. అభిమానులు పేటీఎమ్ paytm app, paytm insider app/insider.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి తెలిపారు. కనీస ధర రూ.600లు కాగా రూ.1500, రూ.2000, రూ.3000, రూ.3500, రూ.6 వేల వరకు ఆరు డినామినేషన్లలో టికెట్లు ఉంటాయన్నారు. ఆఫ్‌లైన్‌లో టికెట్లను ఈనెల 14న ఉదయం 10 నుంచి 4 గంటల వరకు వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్, మున్సిపల్ స్టేడియం, రాజీవ్‌గాంధీ క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా తీసుకున్న టికెట్లను 19న వైఎస్ఆర్ స్టేడియం బి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఫిజికల్ టికెట్లుగా మార్చుకోవచ్చన్నారు. మ్యాచ్‌ను 27 వేల మంది స్టేడియంలో ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉంది. వెస్టిండీస్ జట్టు భారత్‌తో ఇక్కడ 2019లో తలపడగా మూడున్నరేళ్ల తరువాత వన్డే మ్యాచ్ జరగనుంది.

ఆర్పీఎఫ్ బ్యారక్ ప్రారంభం



ఆధునికీకరించిన బ్యారక్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: డీజిల్ లోకో షెడ్ వద్ద ఆధునికీకరించిన రైల్వే భద్రతా దళానికి చెందిన బ్యారక్‌ను గురువారం వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. అక్కడ అధునాతన వసతులతో కిచెన్, తాగునీరు, రిక్రియేషన్ రూంలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లడుతూ ఆర్పీఎఫ్ సిబ్బందికి డ్యూటీ అనంతరం ఇక్కడ చక్కని విశ్రాంతి దొరుకుతుందన్నారు. అనంతరం బ్యారక్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్(ఆర్పీఎఫ్), సీహెచ్ రఘువీర్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో-ఆర్డినేషన్) పి.కె మహరాణా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(హెడ్ క్వార్టర్స్) ఎస్.కె.సారంగి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

12, 13న సాధారణ సెలవు

విశాఖ విద్య: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 12,13 తేదీల్లో జిల్లాలో పోలింగ్ జరిగే ఇనిస్టిట్యూషన్స్/కార్యాలయాలకు సాధారణ సెలవు మంజూరు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- విస్తృతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో గురువారం ఆయన విస్తృతంగా పాల్గొన్నారు. సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో మాజీమంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనితో కలసి హాజరయ్యారు. అనిట్స్ ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, డెంటల్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం సీతమ్మధారలోని ఏపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, డైరెక్టర్ రమేష్ ప్రసాద్, ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులను కోరారు. సాయంత్రం వన్‌టౌన్‌లోని షాదీఖానాలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు మహమ్మద్ సాధిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం మైనారిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్, ముస్లిం నాయకులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రి విడదల రజని, మాజీ మంత్రి ముత్తంశెట్టి

ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

భీమునిపట్నం: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన భీమిలి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సస్పెండ్ చేసినట్టు తెలిసింది. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు పతివాడ వినోద్‌కుమార్, కోలా హేమంత్ పలు నేరాలకు పాల్పడుతుండడంతో వారి కదలికలపై నిఘా ఉంచాలని కానిస్టేబుళ్లు రమేష్, గోవింద్‌కు సీపీ బాధ్యతలు అప్పగించారు. కాగా ఇటీవల ఆ ఇద్దరు రౌడీషీటర్లు జైలు నుంచి విడుదలై బయటకు వచ్చిన తర్వాత నేరాలకు పాల్పడ్డారు. వారి కదలికలు తెలుసుకుని ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాల్సిన కానిస్టేబుళ్లు ఆ పని చేయలేదు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున కానిస్టేబుళ్లు రమేష్, గోవింద్‌ను సస్పెండ్ చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల కాలంలో నేరాలు పెరుగుతుండడంతో నియంత్రణకు సీపీ శ్రీకాంత్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటున్నారు.

14న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మహారాణిపేట: ఈ నెల 14న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జేసీ విశ్వనాథన్ సూచించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఒకటి నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు సగం ఆల్బెండజోల్ మాత్ర, 2 నుంచి మూడేళ్లలోపు వారికి పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. 3 నుంచి 19 ఏళ్లలోపు వారికి పూర్తి మాత్రను మధ్యాహ్నం భోజనం చేసిన అర గంట తర్వాత చప్పరించే విధంగా చూడాలన్నారు. 14న ఈ మాత్ర వేసుకోని వారు ఈ నెల 18న తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్‌కిషోర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎస్.జీవన్‌రాణి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సేవల పెంపునకు కృషి

సాక్షి, విశాఖపట్నం : జిల్లా పరిధిలో ఉన్న సచివాలయాల్లో ఏపీ సేవా సర్వీసులు పెంచేందుకు కృషి చేయాలని జిల్లా స్థాయి అభివృద్ధి అధికారి(డీఎల్‌డీవో) పూర్ణిమాదేవి ఆదేశించారు. కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు జిల్లాలోని పలు సచివాలయాల్లో గురువారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో నిర్వహిస్తున్న పనులు, లబ్ధిదారుల జాబితా ప్రదర్శన, ఉద్యోగుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఆధార్ మ్యాపింగ్ పెండింగ్‌లు భారీగా పేరుకుపోతున్నాయని.. వీటిని త్వరగా క్లియర్ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటిస్తూ 100 శాతం హాజరుని రోజుకు 3 సార్లు వేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి సచివాలయంలోనూ 29 రకాల డిస్‌ప్లే పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. పథకాలకు సంబంధించి అర్హులు, అనర్హుల వివరాలతో జాబితాలను ప్రదర్శించాలని ఆదేశించారు. రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు.

బీచ్ న్యూ లుక్





విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రెడ్జింగ్ పనులతో.. కోతకు గురైన ఆర్కేబీచ్‌లో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. సముద్రం లోపలి నుంచి డ్రెడ్జింగ్ షిప్ ద్వారా ఇసుకను ఒడ్డుకు తీసుకొస్తుండటంతో.. ఆర్.కె.బీచ్ ఇసుక మేటలతో కొత్త రూపు సంతరించుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఉద్యోగుల ఉద్యమానికి అండగా బీజేపీ

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ఉద్యోగుల ఉద్యమానికి బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వెల్లడించారు. గురువారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలకు, మంత్రులకు 1వ తేదీనే జీతాలు వేస్తున్న ప్రభుత్వం ఉద్యోగులకు మాత్రం జీతాలు వేయకుండా వేధిస్తోందన్నారు. దీంతో ఉద్యోగులు ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ బలపరచిన అభ్యర్థి పీవీఎన్ మాధవ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు

ఫుట్‌బాల్ టోర్నీ సెమీస్‌కు కడప, విశాఖ

విశాఖ స్పోర్ట్స్: ఏపీ సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీలో విశాఖ, కడప జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. రైల్వే స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో సెమీస్ చేరేందుకు వైఎస్సార్ కడప జట్టు 6–0 గోల్స్ తేడాతో కర్నూల్ జట్టుపై విజయం సాధించింది. జట్టు తరపున అనురాధ మూడు గోల్స్ చేయగా అరుణ రెండు, రామలక్ష్మి ఓ గోల్ చేశారు. సెమీస్ చేరేందుకు చెరో మ్యాచ్ గెలిచిన విశాఖ–చిత్తూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరికి విశాఖ జట్టు 4–3తో విజయం సాధించి సెమీస్‌కు చేరింది. హేమహాసిని మూడు, వరలక్ష్మి ఓ గోల్ చేయగా చిత్తూరు తరపున షహీనా మూడు గోల్స్ చేసింది. కల్యాణి, శృతి, ధరణి ఒక్కో గోల్ చేయడంతో కృష్ణా జట్టు 3–0తో శ్రీకాకుళంపై విజయం సాధించింది. తూర్పుగోదావరి జట్టు 2–0తో విజయనగరం జట్టుపై విజయం సాధించింది. అశ్విని, గాయత్రి చెరో గోల్ చేశారు.

సందడి చేశారి‘లా’..



ఏయూక్యాంపస్: తరగతులు, అభ్యసనంలో ఉండే విద్యార్థులు కాస్త విరామం తీసుకున్నారు. ఆడిపాడి సందడి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల విద్యార్థులు గురువారం అసెంబ్లీ మందిరంలో ఉల్లాసంగా ఉత్సాహంగా పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో చిందులేశారు. వేదికపై కొంత మంది నృత్యాలతో అలరిస్తుంటే.. వారిని మరింతగా ప్రోత్సహిస్తూ స్నేహితులు కేరింతలు కొట్టారు. తెలుగు, హిందీ సినిమాల్లో పాపులర్ గీతాలకు డ్యాన్స్‌లు చేస్తూ.. తమలోని కళా నైపుణ్యాన్ని బయటపెట్టారు.

త్వరితగతిన సుందరీకరణ పనులు



పనులు పరిశీలిస్తున్న సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్

దాబాగార్డెన్స్: జీ–20 సదస్సును పురస్కరించుకుని చేపట్టిన నగర సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీడీఎంఏ ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం నుంచి ర్యాడిసన్ బ్లూ హోటల్ వరకు జరుగుతున్న సుందరీకరణ పనులను ఆయన గురువారం జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విమానాశ్రయం, తెలుగుతల్లి ఫ్లైఓవర్, సిరిపురం జంక్షన్, పార్క్ హోటల్ కూడలి, సీతకొండ, గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, ర్యాడిసన్ బ్లూ హోటల్ వరకు సీవ్యూ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సందర్శకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సముద్ర తీరంలో అన్ని సదుపాయాలతో పలుచోట్ల బీచ్‌ల అభివృద్ధి పరిచే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సుందరీకరణ పనుల్లో ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమన్నారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు.

సీతంరాజుకు లాయర్ల మద్దతు

బీచ్‌రోడ్డు: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు జూనియర్ లాయర్లు మద్దతు ప్రకటించారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ఆవరణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట ప్రాధాన్యత ఓటు సీరియల్ నంబర్–3పై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని న్యాయవాదులను అభ్యర్థించారు. తమను గుర్తించి వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.5000 స్టైఫండ్ అందిస్తోందని జూనియర్ లాయర్లు తెలిపారు. సీతంరాజుకు మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ లీగల్ అధ్యక్షుడు జి.ఎం.రెడ్డి, రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శశిధర్ అనూష పట్నాయక్, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ విశాఖ అధ్యక్షులు ఇమ్మంది ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో గోడ కూలి కార్మికులకు గాయాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్–3లో జరుగుతున్న ఓ ఇంటి నిర్మాణ పనుల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. పునాది తవ్వుతుండగా మట్టి పెళ్లలతో పాటు గోడ కూలి కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. వివరాలివీ.. కొన్ని రోజులుగా సెక్టార్–3లో మురళీమోహన్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పలువురు కార్మికులు పునాది తవ్వుతుండగా పశ్చిమ వైపు ఉన్న ఇంటి గోడతో పాటు మట్టి పెళ్లలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో హెచ్‌బీకాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికులు చామంతి అప్పన్న, నరసింహనగర్‌కు చెందిన యలమంచలి ధన, రామారావుకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఎంవీపీ పోలీసులతో పాటు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, యువజన విభాగం నాయకుడు ఉమ్మడి కల్యాణ్ తదితరులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని హుటాహుటిన 108లో విమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎంవీపీ ఎస్‌ఐ శ్రీను మాట్లాడుతూ ఒకరి కాలి ఎముక ఫ్రాక్చర్ అయిందని.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. వారు విమ్స్‌లో చికిత్స పొందుతున్నారని.. నిర్మాణ పనుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఎంఎల్‌సీ రిపోర్టు ధారంగా కేసు దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.



గాయపడిన కార్మికులను పైకి తీసుకొస్తున్న అక్కరమాని వెంకటరావు తదితరులు

గాజువాకలో చెత్త సేకరణ వాహనాల దగ్ధం

గాజువాక : గాజువాకలో రెండు చెత్త సేకరణ వాహనాలు దగ్ధమయ్యాయి. ఒకటి పూర్తిగా దగ్ధం కాగా, మరొకటి పాక్షికంగా దగ్ధమైనట్టు జీవీఎంసీ వర్గాలు తెలిపాయి. పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది కథనం ప్రకారం వివరాలివీ. గాజువాకలో చెత్త సేకరణకు ఉపయోగించే క్లాప్ వాహనాలు జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిలుపుతారు. అందులో ఒక వాహనం ఇంజన్‌లో ఇంటర్నల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి బయటకు వ్యాపించాయి. దీంతో ఆ మంటలు పక్కనున్న మరో క్లాప్ వాహనానికి కూడా అంటుకుంది. దీన్ని గమనించిన స్థానికులు పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. శకటంతో సహా సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఒక వాహనం పూర్తిగా దగ్ధం కాగా, మరో వాహనం మాత్రం పాక్షికంగా కాలింది. కాగా, ఈ ప్రమాదంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆపి ఉంచిన వాహనం ఇంజిన్ నుంచి షార్ట్‌సర్క్యూట్ ఎలా అవుతుందని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

విశాఖ విద్య: జిల్లాలో ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 15 నుంచి 29 వరకు 78 కేంద్రాల్లో, 10వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18 వరకు 136 కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో డీఈవో, ఆర్‌ఐవో తనిఖీలు నిర్వహించి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా పరీక్షల నిర్వహణ సమయంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జేసీ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేసి, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి 0891- 2567561, 10వ తరగతికి 77804 53490 హెల్ప్ లైన్ నంబర్లను ఏర్పాటు చేశామని, సందేహాల నివృత్తికి ఈ నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. డీఈవో చంద్రకళ, ఆర్‌ఐవో పి.ఉమారాణి, వైద్య, విద్యుత్, మున్సిపల్, రవాణా, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం: విశాఖ,అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కార్యాలయంలో గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను గురుకులాల్లో చేరగోరే విద్యార్థులు ఈ నెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాలకు వచ్చేనెల 23వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, 5వ తరగతికి ప్రవేశ పరీక్ష, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు https://apgpcet.apcfss.in/ వెబ్‌సైట్‌లో ఈ నెల 24వ తేదీలోగా నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7674925748 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బాలికల గురుకుల పాఠశాలలు : మేహాద్రిగెడ్డ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కొమ్మాది (మధురవాడ), కోనాం, కొక్కిరాపల్లి, తాళ్లపాలెం, నక్కపల్లి, నర్సీపట్నం.

బాలుర గురుకుల పాఠశాలలు,కళాశాలలు : సబ్బవరం (ఆంగ్లమాధ్యమం ఎంఈసీ, సీఈసీ గ్రూపులు), శ్రీకృష్ణాపురం, దేవరాపల్లి, గొలుగొండ.

నా మాటల్ని ఎడిట్ చేశారు

టీడీపీ తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత

మహారాణిపేట: వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అవుతాడని తాను అనలేదని.. నా మాటలను ఎడిట్ చేశారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. గురువారం విశాఖలోని టీడీపీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళా దినోత్సవం నాడు నాపై ఫేక్ ట్రోలింగ్‌కి దిగజారారని తెలిపారు. ఇప్పుడు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. డబ్బులకు ఆశ పడి నాపై ట్రోలింగ్ చేసిన వారిపై అట్రాసిటీ కేసు పెడతానన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ ఉత్తరాంధ్ర పరిశీలకుడు బుద్దా వెంకన్న మాట్లాడుతూ జగన్ విశాఖలో ఉన్నంత కాలం ఉత్తరాంధ్రవాసులకు కంటిమీద కునుకు ఉండదన్నారు. విశాఖలో జరిగింది జీ సమ్మిట్ అని తెలిపారు.